క్లుప్తంగా

యువకుడికి తీవ్రగాయాలు

సంగం: స్థానిక చెక్‌పోస్టు సెంటర్ కూడలి వద్ద జాతీయ రహదారిపై ఓ బైక్ కారును ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. ఆత్మకూరు వైపు వెళ్తున్న బైక్ నెల్లూరు వైపు వెళ్తున్న కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న యాకసిరి సంతోష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద సోమవారం జరిగింది. పెగళ్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన కొలగాని శ్రీనివాసులు బైక్‌ను వెనుక వైపు ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న శ్రీనివాసులు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మర్రిపాడు పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అందజేసి, అనంతరం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

కిక్కిరిసిన ఆలయాలు


స్వర్ణచీర అలంకరణలో కన్యకాపరమేశ్వరి

ఆత్మకూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. దర్శనం కోసం తెల్లవారు జామున ఐదు గంటల నుంచే భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. శ్రీదేవి, భూదేవి సమేత అలఘనాథ స్వామి ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, జేఆర్‌పేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉండి దర్శనం చేసుకున్నారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారికి స్వర్ణ చీర (బంగారు) అలంకరించారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

చేజర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకందేటట్లు చూడాలని నాయకులు కోరారు. సోమవారం మండలంలోని పెరుమాళ్లపాడు, పుట్టుపల్లి గ్రామాల్లో వికసిత్‌భారత్ సంకల్ప యాత్ర సభను అధికారులతో కలిసి నాయకులు నిర్వహించారు. విశ్వకర్మ యోజన, ముద్ర రుణాలు, పీఎం కిసాన్, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పథకాలను నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామా ల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతుందని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్రశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తూర్పుబోయ మ దుగుల, పెద్దిరెడ్డిపల్లి, వేంపాడు గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తారన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దర్గాకు పోటెత్తిన భకులు


దర్గాలో భారీగా ఉన్న భక్తులు

అనుమసముద్రంపేట: నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాకు భక్తులు పోటెత్తారు. హజరత్ ఖాజానాయబ్‌ర సూల్, దొరసానమ్మ సమాధులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా వద్దకు వచ్చే భక్తులకు దర్గా ఈఓ హుస్సేన్ తాగునీరు, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతి ఏర్పాటు చేశారు.

వైభవంగా వెంగమాంబ ఇరుముడుల ధారణ



దుత్తలూరు: వెంగమాంబ దీక్ష పూర్తిచేసుకున్న భక్తులు సోమవారం మండలంలోని వడ్డిపాళెంలో ఇరుముడుల ధారణ కార్యక్రమం వైభవంగా చేపట్టారు. మంగళ వాయిద్యాలు, భజనలతో వడ్డిపాళెం నుంచి ఊరేగింపుగా నర్రవాడ దేవస్థానం వరకు చేరుకున్నారు. అనంతరం అమ్మ వారికి ఇరుముడులు సమర్పించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుత్తలూరు కొండపై కొలువైన రామలింగేశ్వరస్వామిని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. నర్రవాడ వెంగమాంబ పేరంటాలు సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగింది.

స్వగృహాసం

పేదోడి ముఖంలో స్వగృహాసం తొణికిసలాడుతోంది. ఖరీదైన భూముల్లో సకల వసతులతో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు తమ అభిరుచికి అనుగుణంగా ఇళ్లను నిర్మించుకుంటున్నారు. జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఒక్కొక్క ఇల్లు చూడచక్కని విధంగా ఉంది. విలువైన స్థిర ఆస్తి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో శరవేగంగా నిర్మితమవుతూ కొత్త ఊళ్లు తయారవుతున్నాయి.

- శరవేగంగా పక్కాగృహాల నిర్మాణాలు
- బిల్లులు సకాలంలో చెల్లిస్తున్న అధికారులు
- నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్న లబ్ధిదారులు
- పీఎం అవాస్ యోజన కింద 212
- జగనన్న గృహాలు 1,863


గండిపాళెంలోని జగనన్న గృహం పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసిన కుటుంబం

వరికుంటపాడు: వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లోని గ్రామాల్లో కొత్త ఇళ్లతో కొత్త ఊళ్లు ఆవిష్కృతమవుతున్నాయి. ఇప్పుడు ఎటు చూసినా జగనన్న కాలనీల్లో పక్కాగృహాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో చెల్లించడమేనని తెలుస్తోంది. ఎన్నో ఏళ్లకు పేదోడి సొంతింటి కల నెరవేరుతుండడంతో వారి సంతోషానికి అవధులు లేవు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తూ పేదవారి కలలను సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 60 లేఅవుట్‌లు ఉన్నాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 212 పక్కాగృహాలు మంజూరయ్యాయి. అందులో 8 పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. జగనన్న పక్కా గృహాలు 1,863 మంజూరు కాగా 20 గృహ నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలు కూడా జరిగాయి. మిగిలినవి వివిధ దశల్లోధు ఉన్నాయి.

గృహనిర్మాణాలపై లబ్ధిదారుల ఆసక్తి

వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో జగనన్న పక్కాగృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు. నిర్మాణ పనులు చేపట్టిన వారికి దశల వారీగా లబ్ధిదారుడి ఖాతాల్లో నగదు జమవుతోంది. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం తక్కువ ధరకే లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్, ఇనుప చువ్వలు గృహ నిర్మాణశాఖ ద్వారా అందిస్తున్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉంటే రూ.35 వేలు నగదు అదనంగా మంజూరు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నిర్మాణ పనులు జరుగుతున్న లేఅవుట్లలో లబ్ధిదారులు నిర్మాణ పనులకు ఇబ్బందులు పడకుండా నీటి వసతి విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారు. సంబంధిత అధికారులు నిర్మాణ పనులను నిత్యం పర్యవేక్షిస్తూ లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలనే లక్ష్యంతో నిర్మాణ పనులు మండలాల్లో వేగవంతం చేస్తున్నారు.


గండిపాళెం జగనన్న కాలనీలో నిర్మాణాలు పూర్తయిన గృహాలు


ఉదయగిరి మండలం కొండాపాళెం లేఅవుట్ చురుగ్గా నిర్మాణ పనులు

సొంతింటి కల నెరవేరింది



మా కుటుంబం ఎన్నో ఏళ్ల నుంచి సొంతిల్లు కట్టుకోవాలని కలలు కనే వాళ్లం. ఒక దశలో ఆ కల నెరవేరదు అని బాధపడ్డాం. కానీ జగనన్న ప్రభుత్వం మాకు పక్కా గృహం మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశం కూడా చేశాం. సంతోషంగా ఉన్నాం. జగనన్న మేలును మరువలేం. మా కాలనీ ఒక ఊరుగా మారింది.

– షేక్ నస్రిన్, గండిపాళెం, ఉదయగిరి మండలం

సంతోషంగా వుంది



జగనన్న ప్రభుత్వం మాకు ప్లాట్ మంజూరు చేసి పట్టా కూడా ఇచ్చింది. నాకు చాలా సంతోషంగా ఉంది. మా కుటుంబం, మా నాన్న కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాం. గత టీడీపీ పాలనలో పక్కా గృహం మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వ పాలనలో పైసా ఖర్చు లేకుండా స్థలం ఇచ్చి పక్కా గృహం మంజూరు చేశారు.

– కొమ్మలపాటి మాలకొండలరావు, తోటలచెరువుపల్లె, వరికుంటపాడు మండలం

ఎమ్మెల్యే నివాసంలో నూతన సంవత్సర వేడుకలు


ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు


బీద మస్తాన్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నివాసంలో సోమవారం కొత్త సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సత్కరించారు. భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలాలు, పట్టణాల కమిటీల్లో ఉన్న నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బీదను కలిసిన ఎమ్మెల్యే

దగదర్తి మండలం దామవరంలో ఉన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావును కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

బ్రాహ్మణపల్లికి పోటెత్తిన జనం


బ్రాహ్మణపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి, ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డి

మర్రిపాడు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులతతో పాటు ఆయా నియోజకవర్గాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని, సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలను శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేకు అయోధ్య అక్షతలు

ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి బ్రాహ్మణపల్లి నుంచి ఆత్మకూరు క్యాంపు కార్యాలయానికి వెళ్లే సమయంలో డీసీపల్లి వద్ద స్థానిక ప్రజలు ఆయన వాహనాన్ని నిలిపి అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను అందజేశారు. ఈ సందర్భంగా డీసీపల్లికి చెందిన ప్రజాప్రతినిధులు, స్థానికులు, చిన్నారులు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు.

కోలాహలంగా కొత్త సంవత్సర వేడుకలు


రాజగోపాల్‌రెడ్డితో ఉదయగిరి నేతలు

ఉదయగిరి: ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి దుత్తలూరులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. నూతన సంవత్సరం ప్రవేశించగానే అర్ధరాత్రి రాజగోపాల్ రెడ్డి పార్టీ కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. తెల్లవారు జామున నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, నేతలు, అభిమానులు పెద్ద ఎత్తున క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి రాజగోపాల్‌రెడ్డికి బొకేలు అందజేసి శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయకర్తను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 8 నియోజకవర్గాల నుంచి అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో ఉదయం నుంచి క్యాంపు కార్యాలయం జనాలతో కిక్కిరిసింది. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కొత్త ఏడాది రాష్ట్ర భవిష్యత్ నిర్ణయించబోతోందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వారిలో వివిధ మండలాలకు చెందిన ముఖ్య నేతలు గణపం బాలకృష్ణారెడ్డి, చింతంరెడ్డి పద్మావతి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, గాజుల తాజుద్దీన్, మూలె వినయ్‌రెడ్డి, డి.వాసుదేవరెడ్డి, షేక్ అలీఅహ్మద్, జి.ఓబుల్‌రెడ్డి, చిమిలి రవీంద్ర, మేదరమెట్ల శివలీల, పాలవెల్లి మాలకొండారెడ్డి, పల్లాల కొండారెడ్డి, మలిరెడ్డి విజయ్‌రెడ్డి, మిడదాల రాజారామిరెడ్డి, తదితర నేతలున్నారు.

పింఛన్ల పండగకు సిద్ధం

ఆత్మకూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా పింఛన్ మొత్తాన్ని పెంచుకుంటూ లబ్ధిదారులకు అందజేస్తామన్న వాగ్దానం రేపటి నుంచి కార్యరూపం దాల్చనుంది. జనవరి నెల నుంచి అవ్వా, తాతలు రూ.3 వేలు పింఛన్ అందుకునేందుకు ఆశతో ఎదురు చూస్తుండగా ప్రభుత్వం పింఛన్ల పండగకు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసింది. ఆత్మకూరు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించింది. ఈ నెల 3న ఉదయం 10 గంటలకు మర్రిపాడు, మధ్యాహ్నం 3 గంటలకు అనంతసాగరంలో నిర్వహించనున్నారు. అనుమసముద్రంపేటలో 4న ఉదయం 10 గంటలకు, సంగంలో మధ్యాహ్నం 3 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తారు. చేజర్లలో 5న ఉదయం 10 గంటలకు, ఆత్మకూరులో మధ్యాహ్నం 3 గంటలకు, పట్టణ సమాఖ్య కార్యాలయంలో 3.30 గంటలకు ప్రారంభం అవుతుందని అధికార యంత్రాంగం పేర్కొంది.

వాటర్ ప్లాంట్ నిర్మిస్తాం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని సాత నివారిపాళెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. సోమవారం గ్రామానికి చెందిన పరుచూరి వెంకటేశ్వర్లుగౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిసి మేకపాటికి సమస్య తీవ్రతను వివరించారు. వెంటనే ఆయన రాజ్యసభ సభ్యుడు, వీపీఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ప్లాంట్ మంజూరు చేయాలని కోరారు.

ఉత్సాహంగా వాలీబాల్

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలో సోమవారం ఎండీఆర్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఆటలో మదీనా టీం విజేతగా నిలవగా, అంకమ్మతల్లి టీమ్ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు నగదుతో పాటు, కప్ అందజేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

అల్లూరు: మండలంలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుగా అల్లూరు–2 సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు వివరించారు. ఈ తర్వాత సచివాలయాల వారీగా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేటి నుంచి సాగరంలో..

సోమశిల: అనంతసాగరంలో మంగళవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి వారం తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వెంగళరావునగర్‌లో

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తిస్తారన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


సాగులో ఉన్న వరి

పంటలకు ధరల దన్ను

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పంటల సాగు నుంచి విక్రయాల వరకు రైతులకు అండగా నిలుస్తోంది. వివిధ పంటలకు గిట్టుబాటు దక్కేలా మద్దతు ధరలను ప్రకటించి, అమలయ్యే విధంగా చర్యలు చేపడుతోంది. మార్కెట్‌లో ధరల ఒడిదొడుకులు ఉంటే ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చూస్తోంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని రైతాంగం సంబరపడుతోంది. ప్రకృతి విపత్తులతో నష్టం చేకూరితే మళ్లీ సీజన్ నాటికి రైతుల ఖాతాల్లో నేరుగా పరిహారం జమ చేస్తోంది.

- వివిధ పంటలకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు కల్పన
- రైతులకు గిట్టుబాటు ధర లేకపోతే ప్రభుత్వమే కొనుగోలు
- ప్రకృతి విపత్తులతో నష్టం జరిగితే వెంటనే పరిహారం
- రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన

వివిధ పంటలకు కనీస మద్దతు ధర

పంట	క్వింటా ధర రూ.ల్లో
వరి సాధారణ రకం	2,180
వరి ఏ గ్రేడ్ రకం	2,203
వేరుశనగ	6,377
కందులు	7,000
పత్తి	7,020
మొక్కజొన్న	2,000
సజ్జలు	2,500
రాగులు	3,846
పెసలు	8,558
మినుములు	6,950
నువ్వులు	8,635
పొద్దుతిరుగుడు	6,760

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగగా మార్చింది. గత నాలుగేళ్లగా వివిధ పంటలు సాగు చేసే రైతులు లాభాలు కళ్లజూస్తున్నారు. రైతులకు అండగా నిలబడి ఆర్థికంగా నిలదొక్కుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేకనేక చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వ పాలనలో అన్నదాతలు పడిన ఇబ్బందులు ప్రస్తుత ప్రభుత్వంలో కనిపించడం లేదు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ సేవలను రైతు చెంతకు తెచ్చింది. సబ్సిడీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందిస్తోంది. వివిధ పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ప్రకటించి అండగా నిలుస్తోంది. మార్కెట్‌లో పంట ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉన్నప్పుడు ప్రభుత్వమే నేరుగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తోంది. దీంతో చాలా చోట్ల వ్యాపారులు కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేశారు. ధర బాగా ఉండడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. కనీస మద్దతు ధర లేని పంటలకు కొనుగోలు కేంద్రాలు ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. ఈ రబీ సీజన్‌లో కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వివిధ పంటల ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. మొక్కజొన్న కొనుగోలు మార్కెట్ ఫెడ్ ద్వారా కనుగోలు చేస్తున్నారు. వివిధ రకాల చిరు ధాన్యాల కొనుగోలు పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కనీస మద్దతు ధర రానప్పుడు ప్రభుత్వమే కొనగోలు చేసి రైతులకు అండగా నిలుస్తోంది.

విపత్తుల్లోనూ అండగా

వివిధ ప్రకృతి విపత్తుల సందర్భంగా పంటలు దెబ్బతింటే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించి రైతులకు బాసటగా నిలుస్తోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంట దిగుబడులు తగ్గి నష్టాలు వచ్చే సందర్భంలో ఉచిత పంటల బీమా పథకం ద్వారా ప్రభుత్వమే నగదు అందించి ఆదుకుంటోంది. ఏ సీజన్‌లో నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసిన వెంటనే రైతులకు రాయితీ సొమ్ము అందిస్తోంది.

ప్రభుత్వం రైతులకు చేస్తున్న మేలు మరవలేనిది



రైతు సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ఇంటి వద్దనే విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. పండించిన వివిధ పంటలు కూడా కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి నగదు వెంటనే ఇస్తోంది. దళారుల సమస్య తప్పింది. గత ప్రభుత్వంలో రైతులు ఆర్థికంగా చితికి పోగా, ఈ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారు.

– శ్రీనివాసరెడ్డి, రైతు, ఉదయగిరి

రైతులకు మద్దతు ధర వచ్చేలా చర్యలు



రైతులు పండించిన వివిధ రకాల ఉత్పత్తులను కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. బహిరంగ మార్కెట్‌లో ధరల వ్యత్యాసం ఉంటే ప్రభుత్వమే మద్దతు ధరకు రైతులు నుంచి కొనుగోలు చేస్తోంది. నాలుగేళ్ల నుంచి రైతులక మద్దతు ధర వస్తోంది. ఈ ఏడాది వరి ధాన్యం కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర పెట్టి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

– చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి

ఎమ్మెల్యే కార్యాలయంలో కోలాహలం


ఆత్మకూరు: కార్యాలయంలో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి


ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీస్ అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో సోమవారం పార్టీ క్యాడర్ ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. పలువురు అధికారులు ఎమ్మెల్యేని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఎమ్మెల్యేను పలువురు బొకేలు, పూలమాలలు, శాలువాలతో శుభాకాంక్షలు చెబుతూ ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, కమిషనర్ బి నాగేశ్వరరావు, సీఐ జి వేణు, ఎస్సై ముత్యాలరావు, సెబ్ సీఐ బి నయనతార, ఎస్సై కిరణ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కామేశ్వరితో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, కౌన్సిలర్లు తిరుపతమ్మ, రాధిక, రమాదేవి, సర్పంచ్ హజరత్తమ్మ, పలు మండలాల పార్టీ నాయకులు ఉన్నారు.